

హుస్నాబాద్‌లోని శ్రీసిద్ధేశ్వరస్వామి గుట్టపై అయ్యప్ప స్వామి ఆలయం



నిత్యాన్నదాన సత్రంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వామి మాలధారులు

# స్వామియే శరణం అయ్యప్ప

- హుస్నాబాద్ సిద్ధేశ్వరస్వామి గుట్టపై అలరారుతున్న ఆలయం
- దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు, స్వాములు
- హరిహరసుతుడికి భక్తిశ్రద్ధలతో పూజలు
- కేసీఆర్ సర్కార్ హయాంలో అన్నదాన సత్రం నిర్మాణం

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 16: కఠోర దీక్షలు చేసే అయ్యప్ప స్వాముల కోసం వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధిలో మాలధారులకు నిత్యాన్నదానం నిర్వహిస్తూ అందరిచేత ప్రశంసలు అందుకుంటున్నది హుస్నాబాద్ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ. ప్రత్యేకంగా సిద్ధేశ్వరస్వామి గుట్టపై దక్షిణం వైపున ఈ ఆలయాన్ని అధ్భుతంగా నిర్మించారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్నది. సకల సౌకర్యాల కల్పనతో ఆలయానికి భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది.

### 2002లో ఆలయ ప్రతిష్ఠ

హుస్నాబాద్ పట్టణ శివారులోని సిద్ధేశ్వరస్వామి గుట్టపై పాల్గుణ శుద్ధ దశమి 2002 మార్చి 24న అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠను పీఠాధిపతుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఉమ్మడి జిల్లాల్లో గుట్టపై ఉన్న ఏకైక ఆలయం హుస్నాబాద్ అయ్యప్పస్వామి ఆలయం మాత్రమే. ఈ ఆలయం ఏడాది పాటు భక్తులకు దర్శనం కల్పిస్తున్నది. స్వామి దీక్ష చేపట్టిన వారు దాదాపు 200 మంది ఇక్కడే దర్శనం చేసుకొని ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. మండల పూజమహోత్సవం ఏటా ఆలయంలో నిర్వహిస్తున్నారు. శబరిమలైలో జరిగే మకరజ్యోతి దర్శనంరోజు భక్తులు సమర్పించిన ఆభరణాలను చూసే భాగ్యం కల్పిస్తారు.

### ఒకేసారి 200 మందికి పైగా భోజనం

కేసీఆర్ సర్కార్ హయాంలో నిత్య అన్న ప్రసాద కేంద్రం కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించింది. డీఎంఎఫ్‌టీ, సీడీఎంకు చెందిన రూ.28 లక్షలతో 4,500 చదరపు గజాల స్థలంలో భవనాన్మి నిర్మించారు. ఒకేసారి 200 మంది వరకు భక్తులు, స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరించేలా నిర్మించారు. భక్తుల సహకారంతో ఆలయ ఆవరణలో రూ.20 లక్షలతో చేపట్టిన రేకుల షెడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి.

### 45 రోజులపాటు నిర్విరామంగా..

అయ్యప్ప స్వాములకు హుస్నాబాద్‌అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. ఏటా కార్తీక మాసం నుంచి మార్గశిర మాసం వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. ఆలయ కమిటీకి తోడు భక్తులు సైతం అన్నదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. దాదాపు 200మందికి పైగా భక్తులు 45 రోజులపాటు భిక్ష ఏర్పాటు చేశారు. ఏటా నవంబర్ 25 నుంచి జనవరి మాసం వరకు ఈ అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిష్టతో చేపడుతున్నారు.

## భక్తుల సహకారంతో అభివృద్ధి



హుస్నాబాద్ ప్రజలు, భక్తులు, నాయకులు, సంస్థల సహకారంతో సిద్ధేశ్వర స్వామి గుట్టపై అయ్యప్ప ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్నది. కేసీఆర్ సర్కార్ హయాంలో అయ్యప్ప స్వాముల కోసం నిత్యాన్నదాన ప్రసాద కేంద్రాన్ని నిర్మించారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఏటా అయ్యప్ప స్వామి దీక్షాపరులు పెరుగుతున్నారు. ఆలయ ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణం త్వరలో పూర్తవుతుంది.

– ఆకుల వెంకట్, ఆలయ కమిటీ చైర్మన్, హుస్నాబాద్‌టౌన్

## అన్ని పూజలు నిర్వహిస్తాం



అయ్యప్పను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృప లభిస్తున్నది. ఏటా అయ్యప్ప దీక్షాపరులు పెరుగుతున్నారు. కఠినమైన దీక్షలు చేసేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు. అయ్యప్పను నమ్ముకున్న వారికి అన్ని విజయాలే లభిస్తున్నాయి. అందుకే మాలధారణ చేసే భక్తులు పెరుగుతున్నారు. శబరిమలలో నిర్వహించే ఉత్సవాలను ఇక్కడి ఆలయంలో నిర్వహిస్తూ భక్తుల మనోభావాలను పరిరక్షిస్తున్నాం.

– వడ్డెపల్లి వెంకటరమణ, గురుస్వామి, హుస్నాబాద్

# కార్యకర్తలతో కాసేపు..

**టీ తాగుతూ ఆత్మీయంగా పలుకరించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి**



బీఆర్ఎస్ నేతలతో కలిసి టీ తాగుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(అక్బర్‌పేట–భూంపల్లి), డిసెంబర్ 17: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత మొదటిసారి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదివారం తన పర్యటనలో భాగంగా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో తన వాహనాన్ని నిలిపారు. చౌరస్తాలో అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రోడ్డు పక్కనే టీపాయింట్‌లో టీ తాగుతూ నాయకులతో ఆత్మీయంగా పలుకరించారు. బాగోగులు తెలుసుకుంటూ అందరితో కలిసి టీ తాగారు. ఎమ్మెల్యే వెంట మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ధర్మారం భిక్షపతి, ఉల్లెంగల నరేశ్, పోతారం ప్రతాప్ తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ

- రాందాస్‌గూడలో సర్పంచ్‌కు తీవ్రగాయాలు!



నేతల మధ్య దాడి జరుగుతున్న దృశ్యం

చిలిపిచెడ్, డిసెంబర్ 17: నల్లపోచమ్మ దేవి బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన చిలిపిచెడ్ మండలంలోని రాందాస్‌గూడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో కాంగ్రెస్ నాయకుడు తన ఇంటి స్థలంలో కాంగ్రెస్ జెండాలు ఉండడంతో బీఆర్ఎస్ నాయకులు ఉత్సవాల ముగ్గింపు వరకు తొలిగించాలని కోరారు. జెండాలు తీసివేయడానికి వీలు లేదని చెప్పాడంతో అక్కడున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు కట్టెలతో దాడి చేసుకున్నారు. ఇరువర్గాల్లో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడిలో సర్పంచ్ అంకం యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ విషయమై ఎస్సై షేక్ మహబూబాను వివరణ కోరగా ఘర్షణ జరిగింది నిజమే కానీ ఇరువర్గాల వారు ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన తర్వాత పూర్తి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేస్తామన్నారు.

# చర్ల అంకిరెడ్డిపల్లి సర్పంచ్‌కు ఉత్తమ అవార్డు

చిన్నకోడూరు, డిసెంబర్ 17: బహుజన సాహిత్య అకాడమి హైదరాబాద్ వారు ప్రకటించిన అవార్డుల్లో మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి సర్పంచ్ రాజబోయిన స్వర్ణలతాశ్రీనివాస్ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో ఈ అవార్డును బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ సర్పంచ్ స్వర్ణలతకు అందజేశారు.




ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకుంట్నున చర్లఅంకిరెడ్డిపల్లి సర్పంచ్ రాజబోయిన స్వర్ణలత

# చౌదర్‌పల్లిలో మహిళ ఆత్మహత్య

దుబ్బాక, డిసెంబర్ 17: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట–భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో చోటుచేసుకున్నది. భూంపల్లి ఎస్సై భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌదర్‌పల్లికి చెందిన బండారి మహేశ్ భార్య మౌనిక(26) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా మౌనిక అనారోగ్యంతో బాధ పడుతున్నది. దవాఖానలో చూపించినా ఫలితం లేకపోవడంతో మానసికంగా కలత చెందిన మౌనిక శనివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇంట్లోకి వచ్చిన మహేశ్ ఉరి వేసుకొని వెలాడుతున్న భార్యను చూసి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. ఆదివారం ఉదయం మృతురాలి తల్లి బాలవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదవశాత్తు చెరువులో పడి మరో మహిళ

దుబ్బాక, డిసెంబర్ 17: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట–భూంపల్లి మండలం చిన్ననిజాంపేటలో శనివారం సాయంత్రం చేటు చేసుకున్నది. భూంపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు శేర్వాపురం లక్ష్మికి ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు కనకవ్వ(35)కు 20 ఏండ్ల కిందట చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. కనకవ్వ భర్త మృతి చెందగా, ఆమె తల్లి లక్ష్మితో కలిసి చిన్ననిజాంపేటలో ఉంటున్నది. వ్యవసాయ పనులకు వెళ్లిన కనకవ్వ శనివారం సాయంత్రం స్థానిక పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. కనకవ్వ ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి లక్ష్మి గ్రామస్తుల సహాయంతో ఆదివారం ఉదయం గాలించగా పెద్ద చెరువులో కనకవ్వ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ విషయంపై మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటా..

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



వల్లూర్‌లో ప్రజలకు భోజనం వడ్డిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, డిసెంబర్ 17: కష్టపడి తనను గెలిపించిన ప్రజలకు ఎప్పటికీ అండగా ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూరంపల్లిలో ప్రభాకర్‌రెడ్డి కత్తి పోటుకు గురికాగా త్వరగా కొలుకోవాలని, భారీ మోజార్టీతో గెలవాలని వల్లూర్ సర్పంచ్ ఆనందాస్ మహేశ్వరీనరేశ్, ఎంపీపీ చిందం సబితా రవీందర్, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రచార సమయంలో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలిచిన తర్వాత గ్రామస్తులంతా కలిసి భోజనాలు చేసే కార్యక్రమం ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. అంతకుముందు వల్లూరు నల్లపోచమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహేశ్‌ను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడి పని చేసి భారీ మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలు, ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. వల్లూర్ బస్టాండ్‌తోపాటు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందాస్ మహేశ్వరి, ఎంపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, వల్లూర్ గ్రామ అధ్యక్షుడు మమ్మద్ వాహిద్, ఎంపీటీసీ సత్యనారాయణ, మాస్సమ్మగారి నర్సింహులు, అంబరీష, శ్రీనివాస్, నాగులు, జనార్దన్, లక్ష్మీనారాయణ, మహేశ్, ఎల్లబోయిన సురేశ్, శేఖర్, సంకాపూర్ సర్పంచ్ సుజాతాశ్రీనివాస్, నర్సంపల్లి సత్యం, యోగి, రాములు, ప్రవీణ్, దోబ్బల శేఖర్, ఎంకే నారాయణ, వెంకటి ఉన్నారు.

### రూ.2 లక్షల చెక్కు అందజేత

ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండల పరిధిలోని చెట్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చినోళ్ల ప్రభాకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బీఆర్ఎస్ సభ్యత్వ బీమా కింద వచ్చిన రూ.2 లక్షల చెక్కును ప్రభాకర్ భార్య చినోళ్ల శ్యామలకు ఆదివారం అందజేశారు. ఆపద సమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మోహన్‌రాథోడ్, ఉప సర్పంచ్ ముఖ్‌శ్‌గౌడ్, బోనాల బాలు, చిన్నోల భాస్కర్ ఉన్నారు.